క్లుప్తంగా

పల్లె దవాఖానకు అవార్డు


సిబ్బందిని అభినందిస్తున్న వైద్యాధికారి రమేశ్

రామడుగు: రామడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెలిచాల పల్లె దవాఖానకు ఎన్ క్వాస్ కింద నాణ్యతా సర్టిఫికెట్‌తో పాటు ఉత్తమ పల్లె దవాఖాన అవార్డు లభించిందని మండల వైద్యాధికారి రమేశ్ తెలిపారు. నేషనల్ సిస్టం రిసోర్స్ సెంటర్ ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ క్వాస్ బృందం సభ్యులు ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేశారని, దవాఖానకు 90.55 శాతం మార్కులు వచ్చాయని, రాష్ట్ర వ్యాప్తంగా బృందం సభ్యులు ఐదు వైద్యశాలలను ఎంపిక చేశారని, వీటిలో వెలిచాల పల్లె దవాఖాన ఉందన్నారు. ఉత్తమ అవార్డు రావడానికి ప్రత్యేకంగా కృషి చేసిన వైద్య సిబ్బందికి వైద్యాధికారి శుభాకాంక్షలు తెలియజేశారు.

దళారులతో మోసపోవద్దు

జమ్మికుంట: దళితబంధు పైరవీలు చేసే వ్యక్తులను నమ్మి మోసపోవద్దని మున్సిపల్ కమిషనర్ ఎండి అయాజ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడారు. దళితబంధు రెండో విడుత లబ్ధిదారులు పాస్‌బుక్, ఆధార్, రేషన్‌కార్డు, కులధృవీకరణ పత్రం, మొదటి విడత బిల్స్, రెండో విడుత కొటేషన్, పర్మినోటరీ, ట్రేడ్ లైసెన్స్ 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు కార్యాలయంలో అందజేయాలన్నారు. కార్యాయ సిబ్బంది, మధ్యవర్తులు ఎలాంటి డబ్బులు డిమాండ్ చేసినా ఆధారాలతో ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని లబ్ధిదారులు గమనించాలని సూచించారు.

పారిశుధ్య పనులు


పనులు చేయిస్తున్న మున్సిపల్ సిబ్బంది

హుజూరాబాద్: పట్టణంలోని మూడోవార్డు కుమ్మరివాడలో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించామని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డి తొలగించామని, వర్షాకాలం దృష్ట్యా నీరు నిల్వ ఉండకుండా మురుగుకాలువల్లో పేరుకుపోయిన సిల్ట్ తొలగించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు భూపాల్‌రెడ్డి, సుధాకర్, శ్రీకాంత్, రవీందర్, రాజయ్య, వినయ్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో అవార్డు


అవార్డు అందుకుంటున్న విద్యార్థిని

హుజూరాబాద్: జాతీయ స్థాయి శాస్త్రీయ నృత్య పోటీల్లో పట్టణానికి చెందిన మహేందర్‌రెడ్డి-వినోద దంపతుల కుమార్తె నిర్విరెడ్డి సబ్ జూనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ నెల 15న రాజమండ్రిలోని రాధాకృష్ణ కళాక్షేత్రంలో పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులు, రాజకీయ నాయకుల చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రం అందుకుంది. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

మూతపడిన పాఠశాల పునఃప్రారంభం

వీణవంక: గతేడాది మూతపడిన మండలంలోని దేశాయిపల్లి ఎంపీయూపీఎస్‌ను మండల విద్యాధికారి ఎస్.శోభారాణి మంగళవారం పునఃప్రారంభించారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం నాణ్యమైన విద్య అందుతుందన్నారు. తల్లిదండ్రులందరూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు సంపత్ కుమార్‌చారి, మాజీ సర్పంచ్ జ్యోతి సురేందర్ రెడ్డి, ఉపాధ్యాయురాలు జ్యోతి, గ్రామ కార్యదర్శి, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రైతుభరోసా చెల్లించాలి

ఇల్లందకుంట: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కౌలు రైతులకు రైతుభరోసా చెల్లించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడారు. కౌలు రైతులు, భూమిలేని రైతు కూలీలకు వర్షాకాలం, యాసంగిసీజన్‌లకు కలిపి రూ.12వేలు ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేదంటే రైతుసంఘాలు, కౌలు రైతు సంఘం,వ్యవసాయ కార్మిక సంఘాలను కలుపుకొని ఆందోళనలు చేస్తామన్నారు.

యథేచ్ఛగా భూకబ్జా

- దేశరాజ్‌పల్లిలో రూ.రెండుకోట్ల సీలింగ్ భూమిపై అక్రమార్కుల కన్ను
- ప్రభుత్వ భూమిగా గుర్తించినా ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు


రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు (ఫైల్)

రామడుగు: పట్టణాలకే పరిమితమైన భూమాఫీయా ప్రస్తుతం గ్రామాలకు విస్తరించింది. అధికారుల అండదండతో యథేచ్ఛగా భూకబ్జాలకు పాల్పడుతున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామసక్తులు ఆవేదన చెందుతున్నారు. రూ.కోట్లు విలువ చేసే భూములు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 407లో 71 గుంటల స్థలాన్ని ప్రభుత్వం సీలింగ్ ల్యాండ్‌గా గుర్తించింది. ఈ భూమిని గ్రామానికి చెందిన దళితులకు సేద్యం చేసుకోవడానికి కేటాయించారు. కొందరు సీలింగ్ భూమిని దళితుల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకొని ఇళ్ల స్థలాలుగా విక్రయిస్తున్నట్టు సమాచారం. భూమి జాతీయ రహదారికి కేవలం 300 మీటర్ల దూరంలో ఉండడంతో కబ్జాదారులు గుట్టుచప్పుడు కాకుండా పని కానిస్తున్నారు. మార్కెట్ ప్రకారం భూమి విలువ దాదాపు రూ.రెండుకోట్లకు పైగానే ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. సీలింగ్ భూమి అన్యాక్రాంతమతుందని పలుమార్లు అధికారులకు వినతిపత్రాలను అందజేశామని, అయినా ఫలితం లేకుండాపోయిందన్నారు. సీలింగ్ ల్యాండ్‌ను కబ్జా చేసి ప్లాట్స్‌గా మార్చి హద్దురాళ్ల పాతడంతో కొద్ది రోజుల క్రితం గ్రామ పంచాయతీ అధికారులు తొలగించారు. ప్రభుత్వ స్థలమని, ఎవరు కొనుగోలు చేయొద్దని రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. బోర్డు ఏర్పాటు చేసిన కొద్ది సేపటికే అక్రమార్కులు తొలగించారని, అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయలేదని గ్రామానికి చెందిన పలువురు తెలిపారు. ఇళ్ల స్థలంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న కొందరు గుట్టు చప్పుడు కాకుండా ఇంటి అనుమతి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ పత్రాల ఆధారంగా అనుమతి ఇవ్వాలని కొందరు నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని ప్రచారం. సీలింగ్ భూమిని గ్రామంలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలి

సీలింగ్ భూమికి హద్దులు ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలి. ఇప్పటికే స్థలాన్ని కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అధికారులు వాటిని రద్దు చేయాలి. సీలింగ్ భూమిని గ్రామంలోని పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని కోరుతున్నాం.

వి. మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ, దేశరాజ్‌పల్లి

మండలస్థాయి క్రీడా పోటీలు



చొప్పదండి: పోటీలు ప్రారంభిస్తున్న అధికారులు, రామడుగు: పోటీలు పరిశీలిస్తున్న ఎంఈవో వేణుకుమార్

చొప్పదండి: పట్టణంలో మండల స్థాయి క్రీడా పోటీలను ఎంఈవో మోహన్ మంగళవారం ప్రారంభించారు. స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి నాలుగో తరగతి విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజిరెడ్డి, బి.రాజగోపాలచారి, ఎం చంద్రశేఖర్, రాజ్‌కుమార్, స్నేహలత, స్వప్న, ఆస్మా, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో మంగళవారం స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి మండల స్థాయి ఎంపిక పోటీలను ఎంఈవో అంబటి వేణుకుమార్ ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా స్థాయి పంపించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పద్మజ, మండల కన్వీనర్ దత్తాత్రి, రమేష్, పీడీలు ఇజాజ్, రూప, వీర్‌పాల్‌రెడ్డి, వెంకటలక్ష్మీ పలువురు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ


అదనపు కలెక్టర్ అశ్వినితో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

కరీంనగర్ అర్బన్: అదనపు కలెక్టర్ డా.అశ్వినికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. మంగళవారం కలెక్టరేట్ ఉద్యోగులతో పాటు వివిధ ఉద్యోగ సంఘాల నేతలు కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగం లక్ష్మణ్ రావు, టీజీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి కాళీచరణ్, గడ్డం సుధాకర్, కేంద్ర సంఘం నాయకులు నాగుల నరసింహస్వామి, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మీందర్ సింగ్, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామస్వామి, కార్యదర్శి శంకర్ జిల్లా టీఎన్జీవో నాయకులు శారద, విజయలక్ష్మి, లవకుమార్, కరుణాకర్, నారాయణ, శ్రీనివాస్, ఉమారాణి, శోభ, అశోక్, మధు, రవి, సోమయ్య, అనిత, మంజుల, సుగుణ, ఆశీష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


చొప్పదండి: అవగాహన కల్పిస్తున్న అధికారులు


జమ్మికుంటరూరల్: పరీక్షలు చేస్తున్న డాక్టర్

చొప్పదండి: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు సూచించారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం సీజనల్ వ్యాధులు, తడి, పొడి చెత్త వేరేచేయు విధానం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలు, చేతులు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: మండలంలోని మడిపల్లి గ్రామంలో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. అమృత న్యూరో అసుపత్రి వైద్యుడు రాజేందర్ రోగులకు వివిధ పరీక్షలు చేసి మందుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్ పబ్బు సులోచన, మార్కెట్ డైరెక్టర్ ఎగ్గెటి సదానందం, అసుపత్రి మేనేజ్‌మెంట్ కిరణ్, గ్రామ కార్యదర్శి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురుగుకాలువ శుభ్రం


సాక్షి స్పందన

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామం తొమ్మిదో వార్డులో ఉన్న మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం, గడ్డిని పంచాయతీ పారిశుధ్య సిబ్బంది మంగళవారం తొలగించారు. మురుగుకాలువలో చెత్తాచెదారం నిండిపోయిందని 'సాక్షి'లో మంగళవారం వాట్సాప్ కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై ఎంపీవో ప్రభాకర్ స్పందించి మురుగుకాలువను శుభ్రం చేయించాలని జీపీ కార్యదర్శి శ్రీనివాస్‌ను ఆదేశించారు. సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ నాగేశ్వర్‌రెడ్డి, తదితరులు

సుపరిపాలన సంకల్ప సభ

జమ్మికుంట: ప్రధాని నరేంద్రమోదీ 11 ఏళ్ల సుపరిపాలన అందించి, దేశానికి శ్రీరామరక్షగా నిలిచారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు అధ్యక్షతన సుపరిపాలన సంకల్ప సమావేశం నిర్వహించారు. మోదీ పాలనలో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద నాలుగో ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు. దేశ భద్రతకు తొలి ప్రాధాన్యం, కరోనా కాలం నుంచి పేదలకు ఉచిత రేషన్, అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, ఆర్టికల్ 370 రద్దు, జమ్ముకశ్మీర్ సమస్య, ట్రిపుల్ తలాక్ రద్దు వంటి సాహసోపేతమైన నిర్ణయాలతో దేశాని వెన్నెముకగా నిలిచారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, నాయకులు ఆకుల రాజేందర్, వెంకట్‌రెడ్డి, శీలం శ్రీనివాస్, జీడీ మల్లేశ్, బచ్చు శివన్న, పల్లపు రవి, గణేష్, రాజు, మోతె స్వామి, కొమ్ము అశోక్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న సత్తయ్య, నాయకులు

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి గ్రామానికి చెందిన గుంటుక కాళిదాసు గతేడాది ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. ఎల్ఐసీ పాలసీ చేయడంతో యాక్సిడెంట్ బెనిఫిట్ కింద రూ.రెండు లక్షలు మంజూరయ్యాయని సంస్థ ఏజెంట్ జాలిగం సత్తయ్య తెలిపారు. మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. గతంలో రూ.రెండు లక్షల ముప్పైవేల చెక్కు అందజేశామన్నారు. కరీంనగర్ బ్రాంచ్–2 మేనేజర్ చారి, అసిస్టెంట్ మేనేజర్ కిరణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అటికం శ్రీనివాస్‌గౌడ్, పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు గుంటుక లింగయ్య పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామానికి చెందిన సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్యను కేశవపట్నం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. భవన నిర్మాణకార్మికులు మంగళవారం హైదరాబాద్‌లో లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడికి వెళ్లకుండా సమ్మయ్యను సోమవారం అర్ధరాత్రి అరెస్ట్ చేసి మంగళవారం విడిచిపెట్టారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక: కోర్కెల్ మానేరు నుంచి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి యజమాని నెదూరి రాజ్‌కుమార్‌పై కేసు నమోదు చేశామని,అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

ట్రాక్టర్లను అడ్డుకున్న లస్కర్లు

శంకరపట్నం: మండలంలోని కల్వల ప్రాజెక్ట్‌లోని పొలాలను పలువురు రైతులు ట్రాక్టర్లతో దదును చేస్తుండగా లస్కర్లు అడ్డుకున్నారు. ప్రాజెక్ట్‌కు రెండేళ్ల క్రితం గండిపడడంతో గద్దపాక గ్రామానికి చెందిన కొంతమంది పొలం సాగుచేసుకోవడానికి ట్రాక్టర్లతో భూమిని దదును చేయిస్తుండటంతో ఎస్సారెస్పీ డీఈ కవితకు సమాచారం అందింది. ఏఈ గంగాధర్ లస్కర్లను పంపించి భూమి దదును చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను అడ్డుకొని పంపించివేశారు.



చొప్పదండి: పట్టణంలోని ఆరోవార్డు గాంధీనగర్‌లో డ్రైనేజీలు లేక మురుగునీరు రోడ్డుపై పారుతోంది. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందించడం లేదని దోమలు వృద్ధిచెంది రోగాల బారినపడతామని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అలాగే వీధిలైటు ఏర్పాటు చేసి కనెక్షన్ ఇవ్వలేదని సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
నాగరాజు, మున్సిపల్ కమిషనర్, చొప్పదండి సెల్ నం : 99492 67882

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

దివ్యాంగులను భవిత కేంద్రాల్లో చేర్పించాలి


మాట్లాడుతున్న ఎంఈవో పావని


బ్యాగులు అందజేస్తున్న హెచ్‌ఎం శ్రీనివాస్

చిగురుమామిడి: దివ్యాంగులను చిగురుమామిడి భవిత సెంటర్‌లో చేర్పించాలని ఎంఈవో పావని కోరారు. మంగళవారం భవిత కేంద్రంలో విలీన విద్యలో భాగంగా పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. భవితలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థికసాయం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రబియాబస్రీ, లావణ్య, ఫిజియోథెరపిస్టు స్వప్న, భవిత కేంద్రం నిర్వాహకుడు తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు అందజేత

మానకొండూర్: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో చదువుతున్న విద్యార్థులకు కాంప్లెక్స్ హెచ్ ఎం డి. శ్రీనివాస్ మంగళవారం బ్యాగులు అందజేశారు. విలీన విద్య దినోత్సవం పురస్కరించుకొని నూతనంగా పెయింటింగ్ వేసిన భవిత కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు ఉమ, రాంప్రసాద్, సీఆర్పీ మహేందర్, వసంత విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి


ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

గన్నేరువరం: మండల కేంద్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు నాసిరకంగా నిర్మించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించారు. ఇళ్ల మెట్లు కూలిపోతున్నాయని, లక్షల నష్టం వాటిల్లుతోందని, అసంపూర్తిగా నిర్మించారని, ఆరేళ్లుగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం పేదలు ఎదురు చూస్తున్నారని, నిర్మాణ పనులు పూర్తి చేసి అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, నాయకులు కాంతాల అంజిరెడ్డి, సహాయ కార్యదర్శులు కూన మల్లయ్య, పిప్పల కనుకయ్య, అంజనేయులు, న్యాత కొమురయ్య, నయూమ్ పాల్గొన్నారు.



హుజూరాబాద్‌రూరల్: దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు, చిగురుమామిడి: సుందరగిరిలో..

భూ భారతి రెవెన్యూ సదస్సులు

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో 183 మంది రైతులు దరఖాస్తులు అందించారు. భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి తీసుకువచ్చిందని తహసీల్దార్ సురేఖ తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు రాములు, మహిపాల్, డిప్యూటీ తహసీల్దార్ పార్థసారది, ఆర్ఐలు ప్రత్యూష , సిబ్బంది పాల్గొన్నారు.

చిగురుమామిడి: రైతులు భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న భూ భారతి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం రమేశ్ కోరారు. సుందరగిరి రైతు వేదికలో రెండో రోజు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి 190 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. ఆర్ఐ అరుణ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ లో భూభారతి రెవెన్యూ సదస్సు జరిగింది. రైతుల నుంచి 387 దర ఖాస్తులను స్వీకరించినట్లు తహసీల్దార్ కనుకయ్య తెలిపారు.

అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి


జమ్మికుంటరూరల్: నిరసన తెలుపుతున్న బాధితులు

జమ్మికుంటరూరల్: మండలంలోని కోరపల్లి గ్రామంలో తహసీల్దార్ నల్ల వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యలపై 269 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. భూ కబ్జాలకు పాల్పడుతూ అక్రమ రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్న ఓ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు బ్యానర్‌తో నిరసన తెలిపారు. సాదాబైనామాలో అధికారుల అండతో గ్రామంలో దాదాపు ముప్పై ఎకరాల భూమిని గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ధరణి ద్వారా అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని భూ బాధితులు ఆరోపించారు. భూ కబ్జాకుపాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరపల్లి, వెంకటేశ్వరపల్లి గ్రామంలోని బాధితులు సదస్సులో దరఖాస్తు చేసుకున్నారు. నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐలు సత్యనారాయణ, శంకర్, సర్వేయర్ మనోజ్ సిబ్బంది పాల్గొన్నారు. నిరసనలో పుల్లూరి సంపత్, ఈశ్వర్, పోచయ్య, ఐలయ్య, అనిల్, ప్రభాకర్, భాస్కర్, గిరవేన శ్రీనివాస్, కొమురయ్య, తిరుపతయ్య, కవిత, లక్ష్మి, పూలమ్మ, సుగుణ పాల్గొన్నారు.